సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 23 । మార్చి । 2024



సోమశిలలో 11.25 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 11.25 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 1880 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.




బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.68,300
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,134
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,318
నవర (8గ్రాములు)	రూ.50,544

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.6 /26.2

గాలిలో తేమ 60 శాతంగా శుక్రవారం నమోదైంది. ఉష్ణోగ్రతలు శనివారం కొంతమేర పెరిగే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు.



వైఎస్సార్సీపీ విజయమే లక్ష్యం కావాలి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి, చిత్రంలో బీద మస్తాన్‌రావు, రాజగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

- ఎవరికి వారే అభ్యర్థులుగా భావించి గెలుపునకు పాటుపడండి
- ఎందరు ఏకమైనా సింహంలా బరిలోకి జగనన్న
- ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటా..
- ఆత్మీయ సమావేశంలో విజయసాయిరెడ్డి

జలదంకి: రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు ఎవరికి వారు తామే అభ్యర్థులుగా భావించి.. పార్టీ సత్తా చాటడమే లక్ష్యంగా పనిచేయాలని రాజ్యసభ సభ్యుడు, పార్టీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని జమ్మలపాళెంలో గల ఎస్వీఆర్ కల్యాణ మండపంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, పార్టీ ఉదయగిరి అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి నియోజకవర్గ నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాన్ని విజయసాయిరెడ్డి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఏకమైనా.. సింహం లాంటి జగనన్న సింగిల్‌గా వస్తున్నారని చెప్పారు. తమ పార్టీ విజయం సాధించి.. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి బాధ్యతలు చేపట్టడం తథ్యమన్నారు. కులమతాల మధ్య చిచ్చు పెట్టే బీజేపీ.. అవసరాన్ని బట్టి రంగులు మార్చే చంద్రబాబు.. వారికి వత్తాసు పలికే జనసేనను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని స్పష్టం చేశారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం సీఎంతోనే సాధ్యమనే భావన ప్రజల్లో బలంగా ఉందని చెప్పారు. రాష్ట్రంలో 87 శాతం మందికి సంక్షేమ పథకాలు ఏదో ఒక రూపంలో అందాయని తెలిపారు. మన లక్ష్యం 175కు 175 అన్నారు. కాబోయే రాష్ట్ర పరిపాలన కేంద్రం విశాఖపట్నానికి వెళ్లినా.. నెల్లూరులోని తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్.. ఫోన్ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంటానని వెల్లడించారు. టీడీపీ ఉదయగిరి నియోజకవర్గ అభ్యర్థి కాకర్ల సురేష్ ఎన్నారై అని.. మరో అభ్యర్థికి ఆఫ్రికా, ఇండోనేసియా, దుబాయ్‌లో వ్యాపారాలున్నాయని చెప్పారు. తాను, రాజగోపాల్‌రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసే ఫుల్‌టైమ్ రాజకీయ నాయకులమని తెలిపారు. అందరూ కలిసికట్టుగా పని చేసి నెల్లూరు ఎంపీ, ఉదయగిరి స్థానాలను గెలిచి జగనన్నకు కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు.

40 వేల మెజార్టీ తథ్యం

ఉదయగిరి నియోజకవర్గం నుంచి తనకు, విజయసాయిరెడ్డికి 40 వేల మెజార్టీ తథ్యమని రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. తనకు రాజ్యసభ పదవిని ఇప్పించిన మనసున్న నేత విజయసాయిరెడ్డి అని బీద మస్తాన్‌రావు కొనియాడారు. పార్లమెంట్ అభ్యర్థిగా ఆయన్ను ప్రకటించడం నెల్లూరు ప్రజల అదృష్టమని చెప్పారు. పార్టీ మండలాధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, నేతలు ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, వెంకటశేషారెడ్డి, కొర్సిపాటి రామిరెడ్డి, రావి ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మోహినీ అవతారంలో ప్రసన్నుడు



బిట్రగుంట: కొండబిట్రగుంటలోని బిలకూట క్షేత్ర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన మోహినీ ఉత్సవం కనులపండువగా సాగింది. వేద పండితుల మంత్రాలు, మేళతాళాలు, గోవింద నామస్మరణలను ఆస్వాదిస్తూ కొండబిట్రగుంట, పాతబిట్రగుంట గ్రామాల్లో ఊరేగారు. విశేష పూజలను ఆలయ ప్రధానార్చకుడు సత్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో అర్చక బృందం నిర్వహించారు. అనంతరం పట్టుపీతాంబరాలతో అలంకరించిన ఏకదంత పల్లకిలో కొలువుదీరారు.

న్యూస్‌రీల్

పరీక్షలకు 1658 మంది గైర్హాజరు

నెల్లూరు (టౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 1658 మంది విద్యార్థులు శుక్రవారం గైర్హాజరయ్యారు. మ్యాథ్స్ పరీక్షను నిర్వహించగా, రెగ్యులర్‌కు సంబంధించి 28,301 మందికి గానూ 27,513 మంది హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 1995 మందికి గానూ 870 మంది గైర్హాజరయ్యారు. ఏడు కేంద్రాల్లో జిల్లా అబ్జర్వర్ మువ్వా రామలింగం.. ఐదు కేంద్రాల్లో డీఈఓ రామారావు.. 55 కేంద్రాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేపట్టారు.

కృష్ణపట్నం పోర్టుకు ప్రతిష్టాత్మక అవార్డు

ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టుకు అత్యంత ప్రతిష్టాత్మకమైన అపెక్స్ ఇండియా గ్రీన్ లీఫ్ ప్లాటినం అవార్డు లభించింది. ఢిల్లీలోని అపెక్స్ గ్రీన్ ఇండియా ఫౌండేషన్ నిర్వాహకులు ఈ మేరకు ప్రకటించారు. ఈ సందర్భంగా పోర్టు సీఈఓ జీజే రావు మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు పోర్టులో చేపడుతున్న మొక్కల పెంపకం.. ఆరోగ్య భద్రతపై నిరంతరం నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను పరిగణనలోకి తీసుకొని ఈ అవార్డును ప్రకటించారని చెప్పారు. కాలుష్య నివారణ.. కార్మికుల నైపుణ్యాభివృద్ధి.. సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించారని, అవార్డును త్వరలో ప్రదానం చేయనున్నారని వెల్లడించారు.

కోవూరులో దినే...ష్!



- జాతీయ అధికార ప్రతినిధి పదవితో టీడీపీ ఎర
- కోవూరు బాధ్యతలు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌కు..
- పద్ధతిగా తండ్రీకొడుకులను పక్కకు నెట్టేసిన వైనం

కోవూరు: నియోజకవర్గంలో పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, దినేష్‌రెడ్డి ఆధిపత్యానికి టీడీపీ అధిష్టానం క్రమంగా కత్తెరేస్తోంది. ఈ పరిస్థితుల్లో తమ పయనమెటో తేల్చుకోలేక అగమ్యగోచర స్థితిలో వీరు కొట్టుమిట్టాడుతున్నారు. వాస్తవానికి కోవూరులో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న వీరు పార్టీ అధినేత చంద్రబాబును కలిసి మాట్లాడొచ్చారు. ఇది జరిగిన రెండు రోజులకు టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి అనే పదవిని దినేష్‌రెడ్డికి కట్టబెట్టారు.

24 గంటల్లోనే మరో ఝలక్

ఇది జరిగి 24 గంటలు కాక ముందే కోవూరు టీడీపీ అభ్యర్థి గెలుపు బాధ్యతలను నియోజకవర్గంతో సంబంధంలేని వ్యక్తికి అప్పజెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి టీడీపీలో ఇటీవలే చేరిన నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్‌కు ఈ బాధ్యతను అప్పగించి తండ్రీకొడుకులను పద్ధతిగా పక్కనబెట్టారు. నియోజకవర్గంలో పార్టీ పరంగా ఏ నిర్ణయం తీసుకోవాలన్నా రూప్‌కుమార్‌యాదవ్‌ను వీరు ఇక సంప్రదించక తప్పదు. తండ్రీకొడుకులపై నమ్మకం లేకే టీడీపీ ఈ నిర్ణయానికి వచ్చిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

పోలంరెడ్డి పయనమెటో..?

ప్రస్తుత పరిణామాలతో పోలంరెడ్డి నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. రాజకీయంగా వేమిరెడ్డి బలపడితే ఇక తమకు ఎలాంటి రాజకీయ భవిష్యత్తు ఉండదని, ఈ తరుణంలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని పోలంరెడ్డిపై అనుచరులు తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. కేడర్ ఒత్తిడితో పాటు అధిష్టాన వైఖరితో తీవ్ర అసంతృప్తితో ఉన్న ఆయన త్వరలోనే తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని అనుచరులతో చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం.

సరిహద్దుల్లో ముమ్మరంగా తనిఖీలు

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా

నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్రంలో త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నగదు అక్రమ రవాణా జరగకుండా జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలను ముమ్మరం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. ఎన్నికల అధికారులు చేపట్టాల్సిన చర్యలపై రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ను శుక్రవారం ఆయన నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ హరి నారాయణన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడారు. రాజకీయ పార్టీలు ప్రచారాలు, ర్యాలీలు.. ఇంటింటి ప్రచారం నిర్వహించేందుకు ఎన్నికల అధికారుల నుంచి అనుమతులను తప్పక పొందాలని సూచించారు. రాజకీయ పార్టీల మధ్య ఘర్షణలు జరిగితే అధికారులు వెంటనే స్పందించి, నివేదికలను ఎన్నికల సంఘానికి పంపాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను కల్పించాలని కోరారు. ఓట్ల తొలగింపులు.. మార్పుల కోసం వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. కాగా జిల్లాలోని 18 ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు.

తపాలా సేవలపై విస్తృత ప్రచారం

ఆత్మకూరు రూరల్: తపాలా శాఖ అందిస్తున్న సేవలపై విస్తృత ప్రచారం చేయాలని ఆంధ్రప్రదేశ్ సర్కిల్ అసిస్టెంట్ డైరెక్టర్ సతీష్ పేర్కొన్నారు. ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలోని తపాలా సిబ్బందికి ఇంటింటా పొదుపు పంట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పట్టణంలోని తపాలా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. ప్రజలకు ఉపయోగపడేలా తపాలా శాఖ అనేక మార్పులను చేపట్టిందని చెప్పారు. తపాలా శాఖ జిల్లా సూపరింటెండెంట్ ప్రసాద్, నెల్లూరు, ఆత్మకూరు ఏఎస్పీలు రాజగోపాల్, అహమ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విజయసాయిరెడ్డికి స్వాగతం పలికిన బుర్రా



విజయసాయిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మధుసూదన్ యాదవ్

కందుకూరు రూరల్: వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి, వేణుంబాక విజయసాయిరెడ్డికి కందుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ గుడ్లూరు వద్ద శుక్రవారం ఘన స్వాగతం పలికారు. అనంతరం వారిద్దరూ కలిసి మాచవరంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి నివాసంలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

లారీ ఢీకొని ఒకరి దుర్మరణం



డ్రైవర్ మృతదేహం

ఉలవపాడు: ఓ లారీ డ్రైవర్ నిర్లక్ష్యం, మరో లారీ డ్రైవర్ ప్రాణం తీసింది. ఈ ఘటన మండల పరిధిలోని జాతీయ రహదారిపై ఉలవపాడు – రాజుపాళెం మధ్య గురువారం రాత్రి జరిగింది. శుక్రవారం పోలీసులు వివరాలు వెల్లడించారు. బిహార్‌కు చెందిన డ్రైవర్ పర్వేజ్ అలామ్ శ్రీకాళహస్తి నుంచి మధ్యప్రదేశ్‌కు లారీలో పైపుల లోడుతో బయలుదేరాడు. అదే పైపుల లోడుతో మరో లారీ కూడా వస్తోంది. ఈ సమయంలో ఉలవపాడు – రాజుపాళెం మధ్య టీ దుకాణం సమీపంలో వాహనాలను ఆపారు. లోడు సరిచేసుకునే సమయంలో రెండు లారీల మధ్యలో అలామ్ నిలబడి లారీని ఇంకా వెనక్కు పెట్టాలని డ్రైవర్‌ను కోరాడు. అతను గేరు వేసి జరిపే సమయంలో లారీ ఒక్కసారిగా ముందుకొచ్చి ఢీకొట్టింది. రెండు లారీల మధ్య ఇరుక్కున్న అలామ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు.

మతతత్వ పార్టీతో చంద్రబాబు పొత్తు

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: అధికారంలోకి వస్తే ముస్లిం, మైనార్టీ రిజర్వేషన్లను తొలగిస్తామంటూ ప్రచారం చేస్తున్న మతతత్వ బీజేపీతో చంద్రబాబు నాయుడు పొత్తు పెట్టుకోవడం దారుణమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. ముత్తుకూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి కట్టుబడింది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. ముస్లింలను రాజ్యాధికారం వైపు నడిపించడమే కాకుండా ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చి గౌరవించారని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ విజయం సాధిస్తుందని, జగన్ రెండో సారి సీఎం అవుతారని చెప్పారు. ఎన్నికల తర్వాత రెండు నెలల్లో జనసేన, టీడీపీ, బీజేపీ నేతలు కత్తులు దూసుకునే పరిస్థితి వస్తుందని జోస్యం చెప్పారు. ఎలాగూ అధికారం దక్కదు కాబట్టి ఒకరిపై ఒకరు ఆరోపణలు గుప్పించుకుని, జుట్టు పట్టుకొనే దుస్థితి ఏర్పడుతుందన్నారు.

సోమిరెడ్డి ఓటమి ఖాయం

సర్వేపల్లి నుంచి టీడీపీ అభ్యర్థి పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో చంద్రబాబు మళ్లీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికే టికెట్ ఖరారు చేశారని కాకాణి ఎద్దేవా చేశారు. ఐదోసారి ఓటమి తప్పదని తెలిసి కూడా కొత్త వ్యక్తులు పోటీకి భయపడడంతో బాబు ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదన్నారు. సోమిరెడ్డి అధికారులను బ్లాక్ మెయిల్ చేసేందుకు పూనుకొన్నాడని విమర్శించారు. ఎన్నడూ లేని విధంగా అధికారులపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని విచారం వెలిబుచ్చారు. చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పుకోలేని దుస్థితిలో ఉన్నారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్సీగా, మంత్రిగా పనిచేసినా నాన్ ఫిషర్‌మెన్ ప్యాకేజీ ఎందుకు సాధించలేకపోయావని కాకాణి ప్రశ్నించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, మాజీ ఏఎంసీ చైర్మన్ మునుకూరు రవికుమార్‌రెడ్డి, హార్టికల్చర్ బోర్డు సభ్యుడు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు శివప్రసాద్, ఆలపాక శ్రీనివాసులు, అనంతరాజు వేణుగోపాల్, పోలిరెడ్డి చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవే నా జీవితాశయం

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి



చిన్నారితో కరచాలనం చేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: 'ప్రజాసేవే నా జీవితాశయం. ఏ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించినా ఆ ప్రాంత అభివృద్ధి ఆకాంక్షించి రాజకీయాలు చేస్తా. ఎలాంటి స్వార్థపూరితమైన కార్యక్రమాలు చేయడం నాకు తెలియదు' అని వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రూరల్ మండలంలోని కొమ్మరపూడి, ములుమూడి గ్రామాల్లో శుక్రవారం ఆదాల ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి పనులు చేసే వారు కావాలో.. రౌడీ రాజకీయాలు చేసే వ్యక్తులు కావాలో.. ప్రజలు ఆలోచించి ఓట్లు వేయాలని కోరారు. ఎంపీగా విజయసాయిరెడ్డిని, రూరల్ ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నగర మేయర్ స్రవంతి, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ప్రముఖ న్యాయవాది మలిరెడ్డి కోటారెడ్డి, రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు సుధీర్‌కుమార్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ హరిబాబు యాదవ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లంక రామశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందలమెక్కించిన జగన్‌కు వీపీఆర్ వెన్నుపోటు

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: 'ఆదరించి అందలం ఎక్కించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే వేమిరెడ్డి దంపతులు వెన్నుపోటు పొడిచారు. అలాంటి వారికి కోవూరు నియోజకవర్గ ప్రజలు ఒక లెక్కా' అని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విమర్శించారు. విడవలూరులో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి నివాసంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ కోవూరు అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇటీవల రాజుపాళెంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి అవినీతిరహిత పాలన తీసుకొస్తామని చెప్పారన్నారు. వాస్తవానికి కాంట్రాక్టర్లు పనులు చేయకుండానే అధికారులు, ప్రభుత్వాలను మేనేజ్ చేసుకుని బిల్లులు చేసుకుని డబ్బులు సంపాదిస్తారన్నారు. అవినీతి చేయకుండానే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి వేల కోట్ల రూపాయలు ఎలా వచ్చాయో ఆమె ప్రజలకు చెప్పాలన్నారు. ఏనాడైనా ప్రజలతో మమేకమయ్యారా అని నిలదీశారు. డబ్బుతో ఎమ్మెల్యే, ఎంపీ అయిపోవచ్చని వేమిరెడ్డి దంపతులు కలలు కంటున్నారన్నారు. నిజాయితీపరులు ఎవరు.. ఎవరికి ఓటు వేయాలో ప్రజలకు బాగా తెలుసన్నారు. రాజకీయాలు, కులమతాలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందించారన్నారు. వేమిరెడ్డిని తన నియోజకవర్గంలోని ప్రతి మండలంలో కార్యక్రమాలకు తీసుకెళ్లానని, ఆయా సందర్భాల్లో నల్లపరెడ్డి వంటి కుటుంబం ఎక్కడా ఉండదని ఆయన చెప్పారన్నారు. ఇప్పుడు పార్టీ మారేవారు తనపై విమర్శలు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. సమావేశంలో ఎమ్మెల్సీ, కోవూరు పరిశీలకుడు బల్లి కళ్యాణ్ చక్రవర్తి, డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, ఆఫ్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, నాయకులు నవీన్ కుమార్‌రెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా ఏర్పాట్లు

- కలెక్టర్ హరినారాయణన్



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

కోవూరు: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పక్కాగా చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. కోవూరులోని జేబీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ ఓటర్లున్న చోట్ల సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలుసుకుని సులువుగా వెళ్లి వేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇంకా కేంద్రాల్లో మౌలిక వసతులపై దృష్టి సారించామన్నారు. వేసవి కాలం దృష్ట్యా షెల్టర్ ఏర్పాటు చేయడం, తాగునీరు అందుబాటులో ఉంచడం వంటి సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. ప్రతి కేంద్రంలో దివ్యాంగుల రాకపోకలకు ర్యాంపులు పెట్టాలన్నారు. విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సెక్టోరల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కలెక్టర్ వెంట కోవూరు రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, ఈఆర్వో శ్రీనివాస్, తహసీల్దార్ విజయశ్రీ, సెక్టోరల్ అధికారి ఇందిరావతి ఉన్నారు.

591 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో శుక్రవారం 591 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. మొత్తం 725 బేళ్లు రాగా వాటిలో 591 బేళ్లను విక్రయించామన్నారు. మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరిస్కరించినట్లు తెలియజేశారు. వేలంలో 75,671 కిలోల పొగాకును విక్రయించామన్నారు. ఒక కిలోకు గరిష్టంగా రూ.230, కనిష్టంగా రూ.220 ధర లభించిందన్నారు. సగటు ధర రూ.228.10గా నమోదైందన్నారు. వేలంలో 17 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

కుటుంబసభ్యుల్లా చూసుకుంటా

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: వైఎస్సార్‌సీపీలో చేరే వారిని కుటుంబసభ్యుల్లా చూసుకుంటానని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలో 20, 24 వార్డుల్లో టీడీపీకి చెందిన బి.ఝాన్సీ, ఎ.స్వాతి, ఎం.శ్రీవల్లి, తుజ, జాను, మరియమ్మ, రవికుమార్, అమర్, రవి, ఉదయ్, సన్నీ, విక్కీ, ఇంకా 200 మంది ఆ ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇర్మియ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానికంగా జరిగిన ఈ కార్యక్రమంలో రామిరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలను మోసం చేసే అలవాటు తనకు లేదన్నారు. టీడీపీలో అవమానాలు ఎదుర్కొంటున్న వారు వైఎస్సార్‌సీపీలో చేరాలని వారి ఆత్మగౌరవానికి భంగం వాటిల్లకుండా చూసుకుంటానన్నారు. మోసాలనే బతుకుదెరువుగా చేసుకొని రాజకీయంగా ఎదగాలని నక్కచిత్తులు ప్రదర్శిస్తున్న వారి వలలో బలి కావొద్దని చెప్పారు.

మళ్లీ అదే ఇల్లు.. ఈసారి కత్తి పెట్టి..

- ఓ ఇంట్లో వారం క్రితం బీభత్సం సృష్టించిన దొంగలు
- అక్కడికే వెళ్లి కత్తులతో బెదిరింపు
- నగదు డిమాండ్. కేకలు వేయడంతో పరారీ

కందుకూరు: ఓ ఇంట్లో వారం క్రితం దొంగలు చొరబడి నానా బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. మళ్లీ అదే ఇంట్లో దుండగులు హల్‌చల్ చేశారు. ఈసారి ముసుగులు ధరించి కత్తులతో బెదిరించి నగదు డిమాండ్ చేశారు. అప్రమత్తమైన స్థానికులు పట్టుకునే ప్రయత్నం చేయగా పరారయ్యారు. ఈ ఘటన శుక్రవారం సంచలనంగా మారింది. బాధితులు, పోలీసుల కథనం మేరకు.. కనిగిరి రోడ్డులో నివాసం ఉండే కనమర్లపూడి శివరామకృష్ణ, వినీల దంపతుల ఇంట్లోకి 16వ తేదీ అర్ధరాత్రి ప్రవేశించిన నలుగురు దుండగులు నానా బీభత్సం సృష్టించారు. కర్రలు, కత్తులతో దాడి చేయడమే కాకుండా ఏకంగా రెండు గంటలపాటు పాగా వేసి కొంత నగదుతో ఉడాయించారు. అదే ఇంటికి శుక్రవారం పట్టపగలు ముసుగులు ధరించి ఇద్దరు వ్యక్తులు వచ్చారు. ఒకడు నేరుగా లోపలికి వెళ్లి శివరామకృష్ణ, ఆయన కుమారుడిపై మరోసారి దాడికి పాల్పడ్డాడు. 'మమ్మల్ని గుర్తుపట్టలేదా మొన్న వచ్చాం కదా.. రూ.15 లక్షలు ఇస్తానని చెప్పావు కాదా.. పోయి డబ్బుల బ్యాగ్ తీసుకుని రా' అంటూ అరిచాడు. డబ్బు ఇవ్వాలని లేదంటే నీ కొడుకుని చంపుతానంటూ మెడపై కత్తి పెట్టాడు. భయాందోళనలకు గురైన కుటుంబసభ్యులు పెద్దగా కేకలు వేశారు. చుట్టుపక్కల వారి వినికిడి గమనించిన దుండగుడు వారిని కత్తితో బెదిరించి రోడ్డుపైకి చేరుకుని బైక్‌పై వేచి ఉన్న మరో వ్యక్తితో కలిసి పరారయ్యాడు. బాధితులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు విచారణ చేపట్టారు.

లక్ష్యంగా సాగిందా?

ఒకే ఇంటిని లక్ష్యంగా చేసుకుని దాడులకు ఎందుకు పాల్పడుతున్నారనే విషయం చర్చనీయాంశమైంది. దాడులకు వస్తున్న వారు నిజమైన దొంగలేనా లేదా కుటుంబ వివాదాల నేపథ్యంలో ఇలా చేస్తున్నారా అని తెలియాల్సి ఉంది. శివరామకృష్ణ కుదవ వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలో ఎవరితోనైనా వ్యాపారానికి సంబంధించి విభేదాలున్నాయా అని పోలీసులు ఆరా తీస్తున్నారు.

పరామర్శించిన బుర్రా

ఘటన గురించి తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ శివరామకృష్ణ కుటుంబాన్ని పరామర్శించారు. అక్కడి నుంచే పోలీసులతో మాట్లాడి పదేపదే దాడులకు పాల్పడుతున్న నిందితులను వీలైనంత త్వరగా పట్టుకుని బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

నెల్లూరు పౌల్ట్రీ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 118
లేయర్ (లైవ్) : 73
బ్రాయిలర్ చికెన్ : 214
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 236
లేయర్ చికెన్ : 125

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.65
సన్నవి : రూ.60
పండ్లు : రూ.20